ఫలితాలపై రచ్చబండ లెక్కలు

- లెక్కలతో కుస్తీపడుతున్న నాయకులు
- గ్రామాలలో జోరుగా చర్చలు
- కౌంటింగ్ కోసం జనం నిరీక్షణ

కాణిపాకం: గత సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు నువ్వా–నేనా అంటూ పోటీ పడిన నేపథ్యంలో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రజా తీర్పు ఇప్పటికే ఈవీఎంలలో నిక్షిప్తమయింది. గెలుపుపై ఎవరి అంచనాలు వారికి, ఎవరి ధీమాలు వారికి ఉన్నాయి. అయితే గ్రామాల్లో ఎన్నికల వేడి మాత్రం ఇంకా తగ్గలేదు. నలుగురు గుమిగూడిన చోట ఫలితాలు, మెజారిటీలపైనే జోరుగా చర్చ సాగుతోంది. గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంది. రచ్చబండ చర్చలు కొనసాగుతున్నాయి. సామాజిక వర్గాల ప్రకారం ఎవరు, ఏ పార్టీ వైపు మొగ్గు చూపేందుకు అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది. ఎవరెవరికి ఏఏ అంశాలు అనుకూలంగా ఉన్నాయనే విషయమై చర్చలు పెరుగుతున్నాయి.

గెలుపు ఏ విధంగా ఉండబోతోంది. గ్రామాల వారీగా మెజారిటీ వచ్చేందుకు ఏ పార్టీకి అవకాశం ఉందన్న లెక్కలు జోరుగానే వేస్తున్నారు. పక్క రాష్ట్రాలు సైతం రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నాయి.

చర్చలు.. గుసగుసలు

గ్రామాల వారీగా తమవైపు నిలబడే ఓటర్ల లెక్కలను గ్రామ స్థాయి నాయకుల ద్వారా పోటీదారులు, వారి వర్గం వారు ఆరా తీస్తున్నారు. రాజకీయంగా చురుగ్గా ఉండే నాయకులకు స్థానికంగా లెక్కల మాట అటుంచితే, ఇతర ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితుల నుంచి ఫోన్లు కూడా అధికంగా వస్తున్నాయి. పూతలపట్టు నియోజకవర్గంలో ఫలితం ఏంటన్న అంశం కూడా ఈ చర్చల్లో ప్రధాన భూమిక పోషిస్తోంది. నియోజకవర్గ ఫలితాలపై రచ్చబండ చర్చల్లో ప్రధానాంశంగా నిలుస్తున్నాయి. ఏది ఏమైనా ఫలితాలు వెలువడే వరకు ఈ చర్చలు కొనసాగుతూనే ఉంటాయన్నది వాస్తవం.



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

మహిళా ఓటర్లే అధికం

నియోజకవర్గంలో 2,20,999 మంది ఓటర్లకుగాను 1,93,730 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 95,962, మహిళలు 97,767, ఇతరులు ఒక్క ఓటు వేశారు. 27,269 మంది ఓటుకు దుమ్మా కొట్టారు. దీంతో నియోజకవర్గంలో పోలింగ్ 87.66 శాతం నమోదైంది. అయితే ఎన్నికల్లో మహిళలే తీర్పు కీలకంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

గప్‌చుప్!

సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడం కోసం వీధుల్లోని గోడలపై పోస్టర్లు అతికించే ఆనవాయితీ నుంచి డిజిటల్ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేసేంతవరకు రూపాంతరం చెందింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా నియోజకవర్గ అంతటా జోరుగా ప్రచారం సాగింది. సోమవారం ఎన్నికల ముగియడంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మూగబోయింది. వాట్సాప్ మెసేజ్‌లు, అభ్యర్థుల బ్రాడ్ కాస్టింగ్ కాల్స్, ఇన్‌స్టా, రీల్స్, ఎక్స్‌పోస్టర్లతో దద్దరిల్లిన సోషల్ ప్రచారం గుప్‌చుప్ అయిపోయింది.

ఓటుకు దూరం

నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును పలువురు సద్వినియోగం చేసుకోలేదు. గత ఎన్నికల కంటే ఈ సారి పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైనప్పటికీ నియోజకవర్గంలో 27,269 మంది ఓటర్లు ఓటు వేయలేదు. వాస్తవానికి, ఓటు హక్కు ప్రాధాన్యతపై యంత్రాంగం విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఓటు విలువను ప్రజలకు తెలియజేసింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

సోషల్ మీడియా కీలకపాత్ర

ఎన్నికల ప్రచారంలో ఈసారి సోషల్ మీడియా ప్ర చారం కీలకపాత్ర పోషించింది. ఒకానొక క్రమంలో సినిమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ క్రికె ట్ మానియాను సైతం తలదన్నేలా డిజిటల్ ప్రచా రం కొనసాగింది. ఒక్క పోస్ట్, ఒకే ఒక్క రీల్‌తో వేల మందిని ప్రభావితం చేసేలా అన్ని పార్టీ లు దృష్టి సారించాయి. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వా ట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితర మాధ్యమా ల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. వివిధ పార్టీలు, ఆయా అభ్యర్థులు ప్రైవేట్ పాటల ఆల్బమ్‌లను రూపొందించి వాటిని సోషల్ మీడియా ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నారు. భౌతికంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను సోషల్ మీడియాలో ప్రసారం చేశారు. ఈ ప్రచారం కోసం కొన్ని పార్టీలు ప్రత్యేకం గా టెక్నికల్ టీములను సైతం నియమించుకోవడం విశేషం. ఇదే అదనుగా కొందరు అవాస్తవాలను, దుష్ప్రచారాలకు తెరలేపారు. వ్యూస్ కోసం, వైరల్ కావడం కోసం అవసరమైన సమాచారాన్ని ప్రచారం చేసిన సంఘటనలూ లేకపోలేదు. ఏదేమైనా పోలింగ్ ముగియడంతో సోషల్ మీడియాలో పోస్టులు తగ్గిపోయాయి. అక్కడక్కడా ఆయా పార్టీల శ్రేణులు లెక్కలు అంచనాలతో పోస్టులు పెడుతూ కాలక్షేపం చేస్తున్నారు.



సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటో

అధిక రక్తపోటు గుండెకు చేటు



బంగారుపాళెం : రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శిరీష

బంగారుపాళెం: రక్తపోటు గుండె జబ్బులకు దారి తీస్తుందని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని శుక్రవారం పురస్కరించుకుని స్థానిక ఆస్పత్రి ఆవరణలో రక్తపోటు(బిపి)పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మానవుని దైనందిన జీవన విధానంలో ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, మానసిక ఆందోళన, ఊబకాయం, కిడ్నీ సమస్య, హార్మోన్లలో మార్పులు, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, వంశ పారంపర్య లక్షణాలు లాంటి అనేక కారణాలతో బీపీ వస్తుందన్నారు. అధిక రక్తపోటు సమస్య మూత్రపిండాల వ్యాధి, గుండె అటుపోట్లకు దారి తీస్తుందన్నారు. బీపీ అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించాలని చెప్పారు. అశ్రద్ధ చేస్తే ప్రమాదమన్నారు. 'గుండె రక్తనాళాల్లో ఉండే రక్తం వాటి గోడలపై చూపించే ఒత్తిడిని రక్తపోటు' (బ్లడ్ ప్రెజర్) అంటారన్నారు. ఆరోగ్యంగా ఉన్నవారికి 120/80 సాధారణ బీపీ ఉంటుందన్నారు. 130/90గా ఉంటే హైబీపీ, 90/60 గా ఉంటేలో బీపీగా పరిగణిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం 30ఏళ్లపైబడిన వారికి బీపీ, షుగర్ వంటి జబ్బుల వారిన పడుతున్నారని తెలిపారు. ఆరు నెలలకోసారి బీపీ పరీక్ష చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగాతో పాటు ఆహారంలో ఉప్పు తగ్గించుకోవడం, ఒత్తిడిని అధికమిస్తే రక్తపోటు రాదని చెప్పారు. అనంతరం ఆస్పత్రిలో బీపీ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు షాలిని, జ్యోతిస్వరూప్, భరత్, అఖిల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తపోటుపై అప్రమత్తం

ఐరాల: ప్రాణాంతకమైన రక్తపోటు(బీపీ)పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. ప్రపంచ హైపర్ టెన్షన్ డే(అధిక రక్తపోటు) సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి ఆమె ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులతో పాటు ఒత్తిడికి గురై రక్తపోటు(బీపీ), మధుమేహం, ఇతర వ్యాధులబారిన పడుతున్నారని తెలిపారు. మన దేశంలో సుమారు 30 శాతం ప్రజలు రక్తపోటుకు సంబంధించని వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధికి కారణం అధిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, జీవనశైలి అని, వీటి గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ వ్యాయామం చేయడం తోపాటు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకుంటే ఈ ముప్పు నుంచి బయటపడవచ్చన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో బీపీని నియంత్రణలో ఉంచుకునేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బంగారుపాళెం : ఆస్పత్రిలో బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

20 పోలింగ్ కేంద్రాల్లో తక్కువ పోలింగ్

- నగటున 66 శాతం నమోదు
- ఓటర్లలో 35 వేల మంది పోలింగ్‌కు దూరం
- 2,419 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

చిత్తూరు అర్బన్: పరీక్ష ఫలితాల ఉత్తీర్ణతలో ఎలాగైతే అట్టడుగు ఫలితాలు వచ్చిన పాఠశాలలు ఉన్నాయో, పోలింగ్‌లో కూడా అత్యల్పంగా ఓటు హక్కు వినియోగించుకున్న కేంద్రాలున్నాయి. చిత్తూరు నియోజకవర్గంలో 20 పోలింగ్ కేంద్రాలు 70 శాతం పోలింగ్ మార్కును చేరుకోలేకపోయాయి.నియోజకవర్గం మొత్తంలో 35,643 మంది ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇది అభ్యర్థుల గెలుపోటముల్లో కీలకమైన సంఖ్యగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

- ఈ 20 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 20,610 మంది ఓటర్లు ఉంటే.. వీళ్లల్లో స్త్రీలు 10,592, పురుషులు 10,014, ఇతరులు నలుగురు ఉన్నారు. వీరిలో 13,614 మంది మాత్రమే ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.
- పోలయిన ఓట్లు పరిశీలిస్తే స్త్రీలు 6,927 మంది, పురుషులు 6,687 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- అంటే నగటున ఈ 20 పోలింగ్ కేంద్రాల్లో 66 శాతం పోలింగ్ మాత్రమే నమోదయ్యింది.
- ఈ 20 కేంద్రాల్లో మాత్రం 6,996 మంది పోలింగ్‌కు దూరంగా ఉన్నారు.
- ఇక మొత్తం 2,02,850 మంది ఓటర్లలో 1,64,788 మంది ఓటు హక్కు వినియోగించుకుంటే వీళ్లలో స్త్రీలు 84,278 మంది, పురుషులు 80,493 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. అలాగే 2,835 మందికి అదనంగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తే, 2,419 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- మొత్తం ఓటర్లలో 18,225 మంది పురుషులు, 19,823 మంది స్త్రీలు, 14 మంది థర్డ్ జండర్ వాళ్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను 416 మంది ఉపయోగించుకోలేదు.

అత్యల్ప పోలింగ్ నమోదైన కేంద్రాలు

పోలింగ్ కేంద్రం సంఖ్య	ప్రాంతం	పోలింగ్ శాతం
67	నాయుడు బిల్డింగ్స్	58
82	రామ్‌నగర్ కాలనీ	59
105	గిరింపేట	61
75	మిట్టూరు	61
101	పలమనేరు రోడ్డు	63
71	లక్ష్మీనగర్ కాలనీ	63
99	టెలిఫోన్ కాలనీ	65
24	కట్టమంచి	66
135	దుర్గానగర్ కాలనీ	66
132	గిరింపేట	66
133	గిరింపేట	67
89	గంగనపల్లె	67
23	మురుగానిపల్లె	68
74	మిట్టూరు	68
121	గిరింపేట	68
73	మిట్టూరు	68
87	గంగనపల్లె	69
46	కొంగారెడ్డిపల్లె	69
48	గాండ్లపల్లె	69
59	కయినికట్టువీధి	69

నగరవనంలో సెలవుల సందడి

జనంతో కిటకిటలాడుతున్న నగరవనం





తూగుడు బల్లపై..



కుటుంబసభ్యులతో సరదాగా వాకింగ్



ఎక్కడికి వెళ్లినా ఫోనే ప్రపంచం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఆహ్లాదకరాన్ని అందించే నగరవనంలో సెలవుల సందడి కనిపిస్తోంది. నిత్యం పనిభారం, మానసిక ఒత్తిడి నడుమ నగరవాసి జీవనం అలసిపోతోంది. దీనికి భిన్నంగా కాసేపు ప్రకృతి ఒడిలో గడపటానికి నగరవాసులకు ఆహ్లాదకర వేదికగా మారింది నగరవనం. అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక పెనుమూరు క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన ఈ వనం రెండు నెలల ముందు ప్రారంభమైంది. రోజు 200 మంది వరకు ఇక్కడ సేదతీరుతున్నారు. పండుగ, వారాంతరాల్లో ఈ రద్దీ రెండింతలవుతోంది. ఉదయం పూట చుట్టుపక్కల ప్రాంతాల వారు వాకింగ్‌కు వస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలతో కలిసి కుటుంబసభ్యులు పార్కులో గడపటానికి జనం వస్తున్నారు. వారాంతరాల్లో బంధువులు, స్నేహితులతో కలిసి ఆనందంగా వచ్చి ఇక్కడ సమయం కేటాయిస్తున్నారు. పిల్లలు ఆటవస్తువులతో ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. 50 హెక్టార్లలో స్థలం ఉన్న పార్కులో పిల్లలు ఆడుకోవడానికి వస్తువులు ఏర్పాటు చేశారు.



సరదాగా ఉయ్యాలూగుతూ..



పిల్లలతో ఆటలాడిస్తున్న అమ్మలు

క్లుప్తంగా

ఆర్బీకేలకు సబ్సిడీ వేరుశనగ



రైతు భరోసా కేంద్రాలకు చేరిన వేరుశనగ విత్తన కాయలు

ఐరాల: మండలంలోని ఎనిమిది రైతు భరోసా కేంద్రాలకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు సరఫరా చేసినట్లు ఏఓ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. మండలానికి 1,710 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు కేటాయించారని, అందులో భాగంగా ఎనిమిది ఆర్బీకేలకు 500 క్వింటాళ్లు విత్తన వేరుశనగ కాయలు సరఫరా అయ్యాయని చెప్పారు. మిగిలిన 10 ఆర్బీకేలకు రెండు, మూడు రోజుల్లో వేరుశనగ కాయలు సరఫరా అవుతాయని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు.

గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవించాలి



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని గురుకువారిపల్లెలో శుక్రవారం ఆయన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 43 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు ఐరన్ మాత్రలు తప్పకుండా తినాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఈఈఓ విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు కవిత, ప్రసూన, శ్రీదేవి, విజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగ జాతరకు అనుమతి తప్పనిసరి

చిత్తూరు రూరల్(కాణిపాకం): గంగజాతర నిర్వహణకు ఆర్వో అనుమతి తప్పనిసరిగా ఉండాలని బీఎన్ఆర్‌పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గంగజాతర నిర్వహణకు నిబంధనలు పాటించాలన్నారు. ఆర్వో అనుమతి తీసుకుని జాతర జరుపుకోవాలని చెప్పారు. అలాగే లౌడ్ స్పీకర్, ఇతరత్రా వాటికి డీఎస్పీ అనుమతి ఉండాలన్నారు. రికార్డింగ్ డ్యాన్సులకు అనుమతులుండవని స్పష్టం చేశారు. జాతర పేరుతో గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే ఊరుకోమన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వేసవిలో పెరుగుతున్న లోడ్

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో విద్యుత్ పరికరాల వాడకం పెరగడంతో లోడ్ పెరుగుతోందని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. గృహాల్లో ఎక్కువగా ఏసీ, ఎయిర్ కూలర్లు, వాణిజ్య, పరిశ్రమల్లో యంత్రాలు, పరికరాల వాడకం పెరగడంతో లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయన్నారు. వాటిని సకాలంలో మార్పు చేస్తున్నమన్నారు. ఏప్రిల్‌లో త్రీ ఫ్యూజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 110, సింగల్ ఫేజ్‌వి 8, మే నెలలో ఇప్పటి వరకు త్రీ ఫ్యూజ్ 69, సింగల్ ఫ్యూజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 13 మరమ్మతులకు గురైనట్లు చెప్పారు. గ్రామాల్లోనూ వాడకం పెరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సకాలంలో లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వివరించారు.

క్షతగాత్రులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య సేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని కీరమంద ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులు వాపోయారు. మొగిలి వద్ద ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో బుధవారం రాత్రి కీరమంద గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన వారిని బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. క్షతగాత్రులకు సిబ్బంది సక్రమంగా వైద్యం అందించలేదని బాధితుల కుటుంబ సభ్యులు తెలిపారు. సకాలంలో డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్యం అందించలేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు.

ఓంశక్తి ప్రత్యేక పూజలు

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురంలో ఉన్న ఓం శక్తి ఆలయంలో అమ్మవారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గురుస్వామి అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటి నుంచి ఓం శక్తి భక్తులు పంబవాయిద్యాల నడుమ కొత్త కుండల్లో పొంగళ్ల సామగ్రితో అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకుని, మూడు సారు ఆలయ ప్రదక్షిణ చేసి, పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, కర్పూరహారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ఆరాధన పూజ



విశేష అలంకరణలో స్వామివారు

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో శుక్రవారం బ్రహ్మంగారి ఆరాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొల్పి, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి పాలాభిషేకం, పంచామృత అభిషేకాలన్నీ చేసి స్వామి వారికి నూతన పట్టువస్త్రాలు సమర్పించి అష్టోత్తర శత నామావళి కార్యక్రమంతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి పాటను మురారి కన్నయ్య పాడి వినిపించారు. ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలనంతరం దర్శనం కల్పించారు.

వేడుకగా అర్జున తపస్మాన్



తపస్మాను అధిరోహించిన అర్జున వేషధారి

పాలసముద్రం : మండలంలోని అలిమేలుమంగాపురంలో ఉన్న ద్రౌపదీదేవి ఆలయంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. వేణుగోపాల నాట్యమండలి కళాకారుడు, శ్రీరంగరాజుపురం మండలం మెదవాడ గ్రామం భాస్కర్ అర్జున వేషధారణలో మెట్టు మెట్టుకు పద్యాలు ఆలపిస్తూ, పరమ శివుడిని వేడుకుంటూ తపస్సు మానును అధిరోహించాడు. అక్కడి నుంచి తపస్సు మాను వద్ద వరపడి సంతానం లేని మహిళలపై నిమ్మపండ్లు, విభూది పండ్లు, పూలు చల్లాడు. వాటి కోసం భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. అంతకుముందు ద్రౌపదీ మాన సంరక్షణ హరికథా గానం భక్తులను అలరించింది. ఈ ఏడాది మండలం తోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ఆవరణలో రద్దీ నెలకొంది.